క్లుప్తంగా

నేడు పీఎం కౌషల్ సమ్మాన్ యోజన పథకంపై అవగాహన



అంబర్‌పేట: విశ్వకర్మల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పీఎం కౌషల్ సమ్మాన్ యోజన పథకంపై అవగాహన కల్పించనున్నట్లు విశ్వకర్మ సంఘం నాయకులు పడకంటి బ్రహ్మచారి అన్నారు. ఆదివారం అంబర్‌పేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విశ్వకర్మల కోసం ఈ పథకం ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. ఈ పథకంపై విశ్వకర్మలకు మరింత విస్తృత అవగాహన కల్పించేందుకు ఈనెల 15న మల్లాపూర్‌లోని వీఎస్.ఆర్.గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, ఓబీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి హాజరుకానున్నట్లు ప్రకటించారు. జలంధరచారి, గోవర్ధనచారి, చెన్నయ్య తదితరులున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



నల్లకుంట: ప్రాణాపాయంలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని నల్లకుంట ఎస్సై ప్రసాద్ అన్నారు. నిత్య జనగణమన కార్యక్రమాన్ని ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా నల్లకుంట శివానంద్‌నగర్‌లో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనికి హాజరైన ఎస్సై ప్రసాద్ రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. మధ్యాహ్నం పేదలకు అన్నదానం చేశారు. నిత్య జనగణమన, సాయి సమాజ సేవ, లీడర్స్ ఫర్ సేవ, వందే ప్రజాసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కులాల రాజకీయ పార్టీలను ఓడించాలి

కాచిగూడ: 'దోపిడి కులాల రాజకీయ పార్టీలను ఓడించకపోతే నిమ్న జాతులకు సామాజిక బానిసత్వం తప్పదని' దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ సీఎం కేసీఆర్ దోపిడి, అప్రజాస్వామిక పాలన నడుస్తోందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీతో పాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అంతర్గతంగా కుమ్మక్కై మెజార్టీ దళిత బహుజన జాతులను సామాజిక, రాజకీయ, ఆర్థికంగా అణిచివేస్తున్నారన్నారు. ఆదివారం నారాయణగూడలో ఆయన మాట్లాడుతూ.. ఈ దోపిడీ కులాల పార్టీల నాయకత్వం నుంచి దళిత జాతి విముక్తి కావాలని లేకపోతే దళిత జాతికి అన్యాయం జరుగుతుందన్నారు. ఈనెల 17న ఢిల్లీలో జరిగే పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో పార్టీ అజెండా కార్యాచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు. డాక్టర్ వీ.ఎల్. రాజు, బీరం సతీష్‌కుమార్, వసంతరావు, గణేష్, దేవునూరి శ్రీనివాస్, మద్దెల ప్రవీణ్ కుమార్, చిప్పరి సుబ్బారావు తదితరులున్నారు.

తైక్వాండో కలర్‌బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్



చిక్కడపల్లి: తైక్వాండో అసోసియేషన్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కెనరా బ్యాంక్ జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్‌లో తైక్వాండో కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ కృష్ణ ఆధ్వర్యంలో 100కి పైగా కలర్‌బెల్ట్ టెస్టుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ముఖ్య అతిథిగా తైక్వాండో అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం టెస్ట్‌లో పాల్గొన్న వారికి కలర్‌బెల్ట్‌లను ప్రదానం చేశారు. మాస్టర్స్ సంజయ్ సింగ్, ప్రసన్న ఆంజనేయులున్నారు.

కొత్త కోర్సులకు బోధకులేరీ..?

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో నాలుగు యూనివర్సిటీలలో ఈ విద్యా సంవత్సరం నుంచి పీజీ, పీజీ డిప్లొమాలలో కొత్త కోర్సులు ప్రవేశపెట్టారు. కానీ బోధనకు ఇప్పటికే విద్యార్థులు తీవ్రమైన అధ్యాపకుల కొరత ఎదుర్కొంటున్న తరుణంలో కొత్త కోర్సులను ఎవరు బోధిస్తారని విద్యార్థి నాయకులు రాష్ట్ర ఉన్నత విద్య మండలి అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఓయూలో ఎమ్మెస్సీ పార్మంటాలజీ సైన్స్, కాకతీయ వర్సిటీలో ఎమ్మెస్సీ సెరికల్చర్ (పట్టు పురుగుల పెంపకం), తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయంలో ఫ్యామిలీ మ్యారేజీ కౌన్సెలింగ్ తదితర పీజీ, డిప్లొమా కోర్సులు ఇదివరకు రాష్ట్రంలో ఎక్కడ కొనసాగడం లేదు.

పచ్చదనాల హరివిల్లు

- నాలా బ్రిడ్జిపైన ఆకట్టుకుంటున్న వర్టికల్ గార్డెన్
- ఆహ్లాదం పంచుతున్న వందలాది ఔషద మొక్కలు



రత్నానగర్ బ్రిడ్జిపై అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: నగర వాసులకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు జీహెచ్ఎంసీ పలు చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగానే వివిధ ప్రాంతాల్లో ఉన్న నాలా బ్రిడ్జిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నది. బ్రిడ్జిలపై ఇరువైపుల పచ్చదనాన్ని పెంపొందించి పాదచారులు, వాహనదారులు, స్థానికులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఇందులో బాగంగానే అంబర్‌పేట నియోజకవర్గంలో నాలా బ్రిడ్జిలు, రైల్వే బ్రిడ్జిల వద్ద వర్టికల్ గార్డెన్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శ్రీకారం చుట్టారు.

రూ.50 లక్షలతో వర్టికల్ గార్డెన్..

బర్కత్‌పుర నుంచి నల్లకుంటకు వెళ్లే ప్రధాన రహదారిలో రత్నానగర్ హుస్సేన్ నాలా బ్రిడ్జి వద్ద వర్టికల్ గార్డెన్‌ను రూ.50 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఒకప్పుడు బ్రిడ్జి వద్ద నడుచుకుంటూ.. వెళ్లేందుకే స్థానిక ప్రజలు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. బ్రిడ్జిపైన మొత్తం చెత్త చెదారం, మూత్ర విసర్జనతో నిండిపోయి ఉండేది. ఈ దారి మీదుగా వెళ్లేవారు ముక్కుమూసుకుంటే గాని వెళ్లే పరిస్థితి ఉండేది కాదు. సమస్యను స్థానిక ప్రజలు, పాదచారులు పలు సందర్భాల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దృష్టికి తీసుకొచ్చారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా నియోజకవర్గంలో పార్కుల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక కృషి చేస్తున్నారు.



త్రీడి ఎఫెక్ట్‌తో దర్శనీయ స్థలాల చిత్రాలు

- హుస్సేన్ సాగర్ నాలా బ్రిడ్జిపై వర్టికల్ గార్డెన్ ఏర్పాటుకు రూ.50 లక్షలు నిధులు కేటాయించారు. పనులు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించి అధికారులకు తగిన సూచనలు, సలహాలు చేశారు.

పూర్తయిన పనులు..

రత్నానగర్ వద్ద హుస్సేన్‌సాగర్ నాలా బ్రిడ్జికి ఇరువైపుల ఏర్పాటు చేసిన వర్టికల్ గార్డెన్ పనులను అధికారులు పూర్తి చేశారు. త్వరలోనే ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్టికల్ గార్డెన్ ఏర్పాటుతో ఆ రోడ్డుకే ఓ ప్రత్యేకత ఏర్పడింది. ఆ రోడ్డు మీదుగా వెళ్తుంటేనే ఓ ఆహ్లాదకరమైన వాతావరణం మనస్సును తాకుతోందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. పచ్చదనం ఆహ్లాదంతో పాటు ఆరోగ్యానికి ఇక్కడ బాటలు వేసుకొనే అవకాశం ఉంటుంది.

వర్టికల్ గార్డెన్‌గా అభివృద్ధి చేశాం



ఓ మంచి వర్టికల్ పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో రూ.50 లక్షలతో ఈ పార్కును తీర్చిదిద్దాం. వర్టికల్ పార్కులు ఏర్పాటు చేయడంతో ప్రధానంగా కాలుష్య ప్రభావం కొంతమేర తగ్గుతోంది. వర్టికల్ గార్డెన్‌లో దేశంలోని ప్రముఖ ప్రాంతాలు, దర్శనీయ స్థలాల బొమ్మలను త్రీడి ఎఫెక్ట్‌తో తీర్చిదిద్దడం వల్ల రాత్రి సమయంలో అత్యంత అద్భుతంగా కనిపిస్తాయి.

– ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

బీజేపీ ఓబీసీ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పూసరాజు, ఎ.వినయ్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి: తెలంగాణ బీజేపీ ఓబీసీ సమ్మేళనం కార్యక్రమాన్ని ఈనెల 18న ఉదయం నుంచి సాయంత్రం 4వరకు నాగోల్ శుభం కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్లు ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్‌లు తెలిపారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లో ఓబీసీ మోర్చా ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్ ఆధ్వర్యంలో తెలంగాణ బీజేపీ ఓబీసీ సమ్మేళనం కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమానికి డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ పాల్గొని కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూసరాజు, వినయ్‌కుమార్‌లు మాట్లాడుతూ.. తెలంగాణ ఓబీసీ సమ్మేళనానికి పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ సీనియర్ నాయకులు శ్రీకాంత్, నర్సింగ్‌రావు, బాలకృష్ణ, కృష్ణప్రసాద్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, ఉపాధ్యక్షుడు సత్యం, సాయి తదితరులున్నారు.

మాతృమూర్తులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

ఇందిరాపార్కులో మహిళలకు సన్మానం



మహిళలను సత్కరిస్తున్న మల్లంపల్లి రమేష్‌రాం

కవాడిగూడ: సమాజంలో ప్రతి ఒక్కరూ మాతృమూర్తులను గౌరవించాలని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మల్లంపల్లి రమేష్‌రాం కోరారు. ఆదివారం మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇందిరాపార్కులో భారతీయ యోగా సెంటర్ ఆధ్వర్యంలో మాతృదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌రాం హాజరై మహిళలను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తల్లి నవమాసాలు మోసి పెంచి పెద్దచేసి అనేక కష్టాలు పడుతుందన్నారు. నేటి సమాజంలో పిల్లలపై పాశ్చాత్య సంస్కృతి ప్రభావం చూపుతోందని దీనితో సమాజానికి ఉపయోగపడాల్సిన పిల్లలు, యువత చెడువ్యసనాలకు బానిసలవుతున్నారని ఆవేద వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల దగ్గర ఉండి వారి బాగోగులు చూసుకోవాలన్నారు. నేడు కన్న బిడ్డలే తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్పిస్తున్నారన్నారు. భారత యోగా సెంటర్ ఇన్‌చార్జ్ సరోజిని, రామారావు, రాజేంద్రకుమార్, డాక్టర్ నిఖిత, జయప్రకాష్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనంలోకి చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్!



చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న నూతన భవనంలో చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ కార్యకలాపాలు ఈరోజు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని పాత పోలీస్‌స్టేషన్ భవనం నుంచి ఫర్నీచర్, కంప్యూటర్లు, ఫైల్స్ అన్నీ నూతన భవనంలోకి తరలించారు. స్టేషన్ సిబ్బంది నూతన భవనంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు సమాచారం. కాగా శనివారం లాంఛనంగా నూతన భవనంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు , అదనపు డీసీపీ రమణారెడ్డి, చిక్కడపల్లి ఏసీపీ ఎ.యాదగిరి, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్ కుమార్, అదనపు ఇన్‌స్పెక్టర్ నరేష్, పోలీస్ ఉన్నతాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. – క్రాస్‌రోడ్డులోని పాత భవనంలో దోమలగూడ పోలీస్‌స్టేషన్‌ను తాత్కాలికంగా ఏర్పాటు చేస్తారని పోలీసులు ప్రకటించారు. భవనంపై భాగంలో ఉన్న చిక్కడపల్లి పోలీస్ సబ్‌డివిజన్ ఏసీపీ కార్యాలయం యథాతథంగా కొనసాగుతుంది.

ఆటో ఫైనాన్షియర్ల బ్లాక్ మార్కెట్‌కు ప్రభుత్వం చెక్ పెట్టాలి

సుల్తాన్‌బజార్: ఆటోబ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న ఫైనాన్షియర్ల పట్ల ప్రభుత్వం, పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడం వల్లే ఆటో బ్లాక్ మార్కెటింగ్ జోరుగా సాగుతుందని, దానిని అరికట్టాలని తెలంగాణ ఆటోడ్రైవర్ జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోలు కేవలం నిరుపేదలు మాత్రమే నడుపుతున్నారని, మార్కెట్‌లో రెండున్నర లక్షల ధరచేసే కొత్త ఆటో రెండింతల ధరకు అమ్ముడుపోతుందన్నారు. ఆటోలు ఇంత బ్లాక్‌మార్కెట్ నడుస్తున్నా పోలీసులు కానీ, ప్రభుత్వం కానీ ఆటో ఫైనాన్షియర్లను కట్టడి చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ సమావేశంలో జేఏసీ ప్రతినిధులు ఆంజనేయులు, ఆజీమ్, అంజయ్య పాల్గొన్నారు.

తానా కార్యాలయం ప్రారంభం

సుల్తాన్‌బజార్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కోఠిలోని ఐఎంఏ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని వినోద్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందు కోసం ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీను మంజూరు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. వైద్యం, ఆరోగ్యం, విద్య, ప్రభుత్వ ప్రధాన ఎజెండాను ఆ దిశలోనే ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతుందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాకేష్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

మనోధైర్యం పెంచేందుకు కరాటే దోహదం



మెడల్స్ సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్ విక్కి

కాచిగూడ: విద్యార్థుల్లో మనోధైర్యం పెంచేందుకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని ఫ్లయింగ్ కిక్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి, కరాటే మాస్టర్ విక్కి అన్నారు. ఢిల్లీలో జరిగిన 7వ నేషనల్ ఫ్లయింగ్ కిక్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్‌లో నగరానికి చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొని చాంపియన్స్‌గా నిలిచారన్నారు. ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తన వద్ద శిక్షణ పొందిన కరాటే విద్యార్థులు పాల్గొని 10 గోల్డ్, 10 సిల్వర్ మెడల్స్‌ను సాధించారని తెలిపారు. విద్యార్థులు ముఖ్యంగా ఆడపిల్లల్లో మనోధైర్యం పెంచేందుకు కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కరాటే మాస్టర్స్ కళ్యాణ్‌గౌడ్, షౌకత్, ఖలీల్, శ్యామ్ పాల్గొన్నారు.

బీసీ కులగణన హామీతోనే కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు



మాట్లాడుతున్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో పార్టీ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపడతామని హామీ ఇచ్చినందుకే కర్ణాటకలో కాంగ్రెస్ భారీ విజయం సాధించిందని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బీసీలను విస్మరించినందువల్లే అక్కడ ఓటమిని చవిచూడాల్సి వచ్చిందన్నారు. భవిష్యత్తులో బీసీలను విస్మరించే పార్టీలకు తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. దేశ వ్యాప్తంగా బీసీలందరూ.. సంఘటితం కావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల లోపు బీసీలను గుర్తించి బీసీల సమస్యలను పరిష్కరించిన పార్టీలకే బీసీల మద్దతు ఉంటుందన్నారు. బీసీ వ్యతిరేక పార్టీగా బీజేపీ వ్యవహరిస్తుండటం వల్లే ఆ పార్టీకి బీసీలు తగిన గుణపాఠం చెప్పారన్నారు.

18న ఇందిరాపార్క్ మహాధర్నాను విజయవంతం చేయాలి

చిక్కడపల్లి: జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకోసం ఈనెల 18న ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని హెచ్‌యూజే జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) కార్యవర్గ సమావేశం త్యాగరాయగానసభలో జరిగింది. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘు విజయానంద్, కార్యదర్శి చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధాని కేంద్రంగా పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలను ఇవ్వాల్సిందేనన్నారు. గత కొన్నేళ్లుగా ఇళ్ల సమస్యను పరిష్కరిస్తామని చెబుతున్న ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ చేపట్టడం లేదన్నారు. సుప్రీం కోర్టు కేసు క్లియర్ అయిందని ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకున్నా పెండింగ్‌లో పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. హెచ్‌యూజే అధ్యక్షులు బి.అరుణ్‌కుమార్, కార్యదర్శులు జగదీష్‌లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన అందరికీ ఇళ్ల స్థలాలు అందేలా ప్రతిపాదనను అమలు చేయాలని కోరారు. టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే ఆధ్వర్యంలో దశలవారీగా వివిధ కార్యక్రమాలు చేపట్టామన్నారు. సంతకాల సేకరణ, రిలే దీక్షలు, స్థానిక ప్రజా ప్రతినిధులు వినతిపత్రాలు ఇవ్వడం లాంటివి పూర్తి చేయగా.. 18న మహాధర్నా కార్యక్రమం ఉంటుందన్నారు. హెచ్‌యూజే నాయకులు గంద్ర నవీన్, రాజశేఖర్, మధుకర్, క్రాంతి, ప్రశాంత్, శ్రీనివాస్, కాలేబు, జహంగీర్, విజయ, తలారి శ్రీనివాస్, సర్వేశ్వర్, నర్సింహా, వెంకటస్వామి, రేనయ్య, శ్రీధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చర్మ వ్యాధుల నివారణకు వైద్య శిబిరం

చంచల్‌గూడ: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్, వీణరాలజిస్ట్, లెప్రాలాజిస్ట్ (ఐఏడీవీఎల్) ఆధ్వర్యంలో ఆదివారం చంచల్‌గూడ పురుషుల, మహిళ జైళల్లో ఖైదీలకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని హైదరాబాద్ డీఐజీ మురళీబాబు ప్రారంభించారు. చర్మ సంబంధిత వ్యాధులకు సంబంధించి ఫ్రీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో మొత్తం 400 మంది ఖైదీలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డీఐజీ మురళీబాబు, సూపరింటెండెంట్ నవాబు శివకుమార్ గౌడ్‌లు మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తే చర్మ సంబంధిత వ్యాధులు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు డా. విజయ్, డా. దినేష్, అనూప్‌కుమార్, డా. ఇందిర, డా. భూమేష్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ వివరించాలి

సైదాబాద్: దేశంలో అన్నివర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ సూచించారు. ఆదివారం సైదాబాద్‌లో ఆయన పార్టీ నాయకులతో కలిసి వాల్ రైటింగ్ అభియాన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, లోకేష్, కోళ్ల గోపి పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని మంత్రి సబితకు వినతి

మీర్‌పేట: నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ మీర్‌పేట సంఘం ప్రతినిధులు ఆదివారం మంత్రి సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 200 గజాల స్థలం, భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు సంఘం మీర్‌పేట అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ తెలిపారు. అనంతరం సంఘం తరఫున మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, విజయ్ రాచకొండ, వెంకటేష్, డీ రామకృష్ణ, డీ రూప్‌కిరణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఈఓ దేవనాథం, చైర్మన్ మురళీప్రసాద్‌లు



టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ ముదిరాజ్



కేతిరి సుధాకర్ రెడ్డి (బలగం కొమురయ్య)ను సన్మానిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

నల్లకుంట: ప్రముఖ పుణ్య క్షేత్రమైన న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం అర్చకస్వాముల మంత్రోచ్ఛరణల మధ్య గర్భాలయంలో కొలువుదీరిన స్వామి వారికి విశేష పూజలు చేశారు.

కవాడిగూడ: హనుమాన్ జయంతి సందర్భంగా కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని దేవాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ ముదిరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్, ఆలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. హనుమాన్ ఆలయ చైర్మన్ రాజశేఖర్‌గౌడ్, శ్రీరాములు యాదగిరి, రాములు, సాయిరాజేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి: హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మన్యుసూక్త పూర్వక పంచామృత అభిషేకం, అర్చన, ఆకుపూజ, వడమాల పూజలు జరిగాయి. ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నేత ముఠా జైసింహ, ఆలయ చైర్మన్ మురళీ ప్రసాద్, ఈఓ దేవనాథం, ప్రధాన అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, సభ్యులు డాక్టర్ టి.రామకృష్ణ, లయన్ జీ.కే.రమణ, మురికి గణేష్, పద్మ బాసాని, అర్చకులు కె.కృష్ణమూర్తి, కందాళ వెంకటాద్రి, ఎస్‌బీఎస్ ఆచారి, సిబ్బంది, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కాగా ఆర్టీసీక్రాస్‌రోడ్డు లక్ష్మీ గణపతి ఆలయ ఆవరణలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈఓ లక్ష్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాచిగూడ: నింబోలిఅడ్డలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో శ్రీ హనుమాన్ జన్మోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, కేతిరి సుధాకర్ రెడ్డి (బలగం కొమురయ్య), ఆంజనేయ సేవా సమితి ఆర్గనైజర్ డీఆర్ఎస్ నరేంద్ర, స్రవంతితో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న బలగం కొమురయ్యను ఘనంగా సత్కరించి అభినందించారు. మల్లికార్జున్, వెంకట్‌రెడ్డి, సాయి కిరణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బలగం కొమురయ్యకు సత్కారం..

బలగం సినిమా నటుడు కేతిరి సుధాకర్ రెడ్డి (బలగం కొమురయ్య) ఆదివారం గోల్నాక డివిజన్ ఖాద్రిబాగ్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు సత్కరించారు. బీజేపీ నేతలు రవీందర్ గౌడ్, సామ్రాజ్, నరేంద్ర, శ్రీధర్, రవీందర్, వంశీకృష్ణ, స్వప్న ప్రియ, మానస, తదితరులు పాల్గొన్నారు.



హనుమంతుడికి అష్టోత్తర శత కలషాభిషేకం



స్వామివారికి లక్ష తమలపాకులతో పూజ

